


# ప్రయాణం

శ్రీవిరించి

చ్రకాల సూట్ కేస్ నింపాదిగా దొర్లించుకుంటూ ప్లాట్ ఫాం మీదకు వెడుతున్నాడు దయానంద్. అప్పుడే రైలు కూడా చేరుకుంటూంది. ఫరవా లేదు, నింపాదిగా వెళ్లవచ్చును.

పట్టాల మీద "జారుడు బండ" లాగ దొర్లుకుంటూ పోతున్న రైలు పెట్టెల వంక చూస్తే యింకా వాటికి కంపార్ట్ మెంట్ నెంబర్లు అంటించనే లేదు.



నయం! తొందరపడి అటు చివరదాక వెళ్లాడుగాదు. తన కంపార్ట్ మెంట్ ఈ పక్కనే వుంటే 'దేవుడా' అనుకుంటూ ఇంత దూరం తిరిగి రావలసి వచ్చేది. ఈ రోజుల్లో రైలు పెట్టెల నెంబర్లు— అవి నెంబర్లు కావు నిజానికి, అక్షరాలు గదా— వరుస క్రమంలో వుండాలని 'రూలేం' లేదు. ముందు 'ఇ' బోగీ వస్తుంది. తర్వాత ఎ, సి, బి, ఎఫ్, డి. ఇలా వాటికి వీలు అయినట్లుగా అవి వస్తాయి. రైలు పెట్టెలకు మాత్రం, ఎంత జడ పదార్థాలు అయితే మటుకు అవి ఎన్ని జీవ పదార్థాలను ఒక్కుమ్మడిగా మోసుకుపోతున్నాయి కాదు— స్వాతంత్ర్యం లేదా యేమిటి, ఇష్టం వచ్చినట్లు వుండటానికి.

ప్లాట్ ఫాం మీదనే ఆగిపోయి, ఎందుకయినా మంచిదని చొక్కా జేబులోంచి 'టిక్కెట్' తీసి చూసు కున్నాడు. 'డి-72'. చుట్టూ వున్న జనాన్ని, హడా వడిగా అటు యిటు పరుగులు తీస్తున్న వాళ్ళను, సామాన్లు బరబర ఈడ్చుకుంటూ పోర్టర్లతో సమంగా పరుగెత్తుతున్న వాళ్లను, ఒక చేత్తో ఎడపిల్లాడిని చంకలో చంటి పిల్లాడిని వేసుకుని ఆయాస పడిపోతూ నడుస్తున్న ఆడ వాళ్లను.. చూస్తూ వుంటే మహా జాలిఅనిపిస్తుంది. మగమహారాజు వీలయితే వస్తాడు, లేకపోతే 'నువ్వొక్క దానివి ప్రయాణం చెయ్యగలవుగా. ఏముంది, ఇక్కడ ఎక్కితే అక్కడ దిగడం అంతేగా' అని ఊరడిస్తాడు. ఇక్కడ ఎక్కడం ఎంత శ్రమో అంతకు పదిరెట్లు శ్రమ అక్కడ దిగడం. ఎక్కే వాళ్ళు దిగే వాళ్లను ఒక పట్టాన కిందకు రానిస్తారా?

ఓ రైల్వే ఉద్యోగి చాక్ పీస్, కాగితాలు తీసుకుని హడావిడిగా ప్లాట్ ఫాం మీద వస్తున్నాడు. ఒక కంపార్ట్

మెంట్ దగ్గర ఆగి 'ఎఫ్' కాగితం అంటించాడు. పక్కనే 'రిజర్వేషన్ చార్ట్' కూడా అతికించాడు. ఆ బోగీ చివరకు వెళ్లిపోయి, చాక్ పీస్‌తో 'ఎఫ్' అని అక్కడ వ్రాశాడు, రెండో కాగితం లేదు కాబోలు. రైలు వాళ్ళు కూడా స్టేషనరీ పొదుపు చేయాలి గదా!... అయితే ఎదురుగా వున్నది 'ఎఫ్' అన్నమాట. 'డి' ఇటు పక్కో, అటు పక్కో వుంటుంది. పోనీ మనిషి ఎదురుగా వున్నాడు గనుక అడిగితే సరిపోతుంది. ఎందుకు మొహమాటం- అని అతను పక్క బోగీ దగ్గర 'బంక' రాస్తూ వుంటే, దయానందే పక్కకు చేరి 'అయ్యా, 'డీ' బోగీ ఎక్కడండీ?' అని అడిగాడు. ఆ మనిషి దయానంద్‌ను ఎగాదిగా చూచి, చేయి పైకెత్తి చూపాడు. దయానంద్ అతను బంక రాస్తూన్న తీరు గమనించడంలో మునిగిపోయి చేయి అటు చూపాడో యిటు చూపాడో గమనించ లేకపోయాడు. ఆకాశం వయిపు చూపినట్లు అనిపించింది అతనికి. రెండో మారు అడుగుదామని నోరు విప్పబోతూ వుండగా, ఆ మనిషి కాస్తా బోగీ చివరకు పరుగు తీస్తూనే వున్నాడు. బంక రాస్తున్న తీరు దయానంద్‌కు బాగా వచ్చింది.. అంటించాల్సిన కాగితం ఎంత జాగా ఆక్రమించు కుంటుందో ఆ మనిషికి ఖచ్చితంగా తెలుసును. ముందు బంక పుల్లతో ఒక చదరం గీస్తాడు. తర్వాత దాని మధ్య 'ఇంటు' గుర్తు పెడతాడు. బంక ఆ ఆకారంలో పెట్టెను అతుక్కుంటుంది. దానిమీద అతికించిన కాగితం చక్కగా బిళ్ళ కుదుములాగ ఆనందంగా కూర్చుంటుంది. బంక వృధా కాదు, కాగితం ఎగిరి పోదు. ఆ మనిషికి ఈ విద్య ఎలా అలవడిందో! దానికేం భాగ్యం అలవాటు కొద్దీ తన పనిలో 'టెక్నిక్' తనే నిర్ణయించుకుంటాడు గదా ప్రతి మనిషీని!

ఇంతకూ 'డి' ఎటు?

ప్లాట్ ఫాం మీద జనం రద్దీ ఇందాకటి కంటె ఎక్కువ అయింది. మీస మేషాలు లెక్కబెడుతూ వుంటే, రైలు కదిలిపోయే ప్రమాదం వుంది. యాంత్రికంగా ఎడంచేతి మణికట్టు వయిపు చూచుకున్నాడు. ఫరవా లేదు. ఇంకా అరగంట టైం వుంది.

టి.టి.ఇ. ఎవరయినా ఇటువయిపు వస్తే బాగుండును. బండి యింకో మూడు నిమిషాలకు బయలు దేరుతుందనగా బోగీల దగ్గరకు వచ్చి నానా హడావడీ చేస్తారు.

దయానంద్ ముందుకు నడిచాడు, ప్లాట్ ఫాం మీద. 'ఇ' కంపార్ట్‌మెంట్ కనిపించింది. దేవుడు చల్లగా చూస్తే పక్కదే 'డి' కావాలి.

దేవుడు చల్లగానే చూచాడు.

ఎందుకయినా మంచిదని దయానంద్ రిజర్వేషన్ ఛార్ట్‌లో పేరు 'చెక్' చేసుకున్నాడు. ఆ! 72 నెంబరుకు ఎదురుగా 'మిస్టర్ దయానంద్' అని ముచ్చటగా టైప్ చేసి వుంది.

గబ గబ సూట్ కేస్ బోగీ లోనికి నెట్టాడు. ఆత్రంగా ముందు వరసలో సీట్ నెంబర్ చూస్తే '6' వుంది. ఇప్పుడు కంపార్ట్‌మెంట్ అంతా నడుచుకుంటూ చివరిదాకా వెళ్లాలి. ప్లాట్ ఫాం మీద వున్నప్పుడే కింద కిటికీలోనుంచి చూచి వుంటే సునాయాసంగా నేల మీదనే నడిచి ముందుకు వెళ్లడానికి వీలయ్యేది. ఇప్పుడు లోపలకు ఎక్కి పెట్టెలుబేడలు సర్దుకుంటున్న ప్రయాణీకులను గుద్దుకుంటూ నదిలో చేపలాగ ఈదుకుంటు యీ చివరనుంచి ఆ చివరకు వెళ్లాలి.

జనాన్ని జాగ్రత్తగా తప్పించుకుంటూ, ఎలాంటి ఏక్సిడెంట్లూ చేయకుండా, చక్రాల సూట్ కేస్‌తో సహా 72 సీట్ దగ్గరకు చేరుకున్నాడు. దేవుడు ఇంకా మేలు చేస్తున్నాడు. ఇంతవరకు ఈ వరసలో ఎవరూ చేరుకో లేదు. తనే మొదలు. 67 సీట్ కిటికీకి పక్కగా వుంది. అక్కడ కూర్చోగలిగితే బాగుండును. ముందు ఆక్రమణ చేసేస్తే, తర్వాత చూచుకోవచ్చును. 67.లో సూట్ కేస్ వేశాడు.

అటు పక్క బోగీలోంచి దిగి ప్లాట్ ఫాం మీదకు వచ్చేసి 'ఫ్రీ'గా నిలబడ్డాడు. కిటికీ అద్దాలు తెరిచే వున్నాయి, గనుక 67 లో సూట్ కేస్ కళ్లకు ఎదురు గానే వుంది. 'సీట్' మనదే గదా అని 'లగేజ్' అక్కడ వదిలేసి రికామీగా అటు యిటు పచార్లు చేయడానికి లేదు. మడిబట్ట చుట్టినట్లు అవుతుంది కొబ్బరిచెట్టుకు. లగేజ్ విషయం ఎంత జాగ్రత్తగా వుంటే అంత క్షేమం!

కాఫీ ఏమన్నా తాగితే బాగుంటుందా?

పోనీ కూల్ డ్రింక్ అయితే!

రైలు బయలు దేరాక అన్నీ లోపలికే వస్తాయి. అయినా ప్లాట్ ఫాం మీద ఊరికే నిలబడి యేమిటి చేయడం? రీడింగ్ మెటీరియల్ కోసం వెదుక్కునే పనిలేదు. పది గంటల సేపు చదవడానికి సరిపోయే ఉద్గ్రంథాలు నాలుగయిదు సూట్ కేస్‌లో పైననే ఏర్పాటుగా వున్నాయి.

ఆ! వచ్చేస్తున్నారు ఒక జంట. జంట పక్కనే సొంటి కాయ. అవును 'లగేజి' సీట్ కిందసర్దేస్తున్నాడు. కుర్రాడు, 'అమ్మా, నాది 67 అన్నావుగా. ఎవరో సూట్ కేస్ పడేశారు' అని అప్పుడే ఫిర్యాదు.

'పక్కకు జరిపి కూర్చో. ఫరవా లేదు' అంది ఆ మహాతల్లి.

నశ్యం రంగు చీర. ముఖంఅంత తీరుగాకనిపించడం లేదు ప్లాట్ ఫాం మీంచి. లోపలకు వెళ్లాక చూడవచ్చు.

కుర్రవాడు అంత పనీ చేశాడు. తన సూట్ కేస్

## రడ్‌యార్డ్ కిప్లింగ్ వ్యాఖ్యపై వచ్చిన కథలు

| | |
|---|---|
| శ్రీ బీ ఆర్ | - 'చిదంబర రహస్యం' |
| శ్రీ ఆర్.వి.రమణప్రసాద్ | - 'వల' |
| శ్రీ విరించి | - 'అకారణం' |
| శ్రీమతి ఎం.విద్యుల్లత | - 'ఓహ్హో! నా పెళ్ళామా!' |
| శ్రీమతి భాగవతుల లలితశర్మ | - '(అ)సావేరి' |
| శ్రీ వెల్చేరు చంద్రశేఖర్ | - 'క్లెవర్ గర్ల్' |
| శ్రీమతి కొవ్వలి నాగేశ్వరి | - 'ఆకూ - వక్కా' |
| శ్రీమతి నెల్లూరి పార్వతీదేవి | - 'ఇల్లు పట్టిన శని' |
| శ్రీ ఎస్.జగన్ మాధవరావు | - 'తెలివైన అర్థాంగి' |

మొత్తం తొమ్మిది కథలలో ఏది ఉత్తమమైనది నిర్ణయించే బాధ్యత పాఠకులదే. ఈ కథలను వరుసలో ప్రకటిస్తాము. పాఠకులు 'నాకు నచ్చిన కథ' (డాష్ వదిలినచోట తమకు నచ్చిన కథ పేరు) వ్రాసి పంపితే, ఎక్కువ ఓట్లు వచ్చిన రెండు కథలకు కవిసమ్రాట్ విశ్వనాథ సత్య నారాయణ గారి రచనలు ఇప్పటి వరకూ లభ్యమైనవి చెరి ఒక సెట్ బహూకరిస్తాము. పాఠకులు 9 కథలను వరుసగా చదవాలి. 9వ కథ ప్రకటించిన వారంరోజుల వరకు పాఠకులు తమ ఓట్లను పోస్ట్ కార్డులద్వారా తెలియపరచవచ్చును.

- ఎడిటర్

నాకు నచ్చిన కథ కూపన్


కథ పేరు........................................................

పంపిన వారి పేరు..............................................

చిరునామా.......................................................

..................................................................

సంతకం




ఇప్పుడు 68 లోనికి వచ్చింది. తను లోపలకు వెళ్లితే 72 లో కూర్చోవడం తప్ప ఇంకో మార్గం లేదు. వచ్చే పోయే జనం, ప్రయాణం పొడుగునా, భుజాలు పొడుస్తారు. కొందరయితే ఎదుటి వాళ్ల కళ్లజోళ్ళు యేమయిపోతు న్నాయో కూడా గమనించరు.

దయానంద్ యిటూరు దగ్గిర దారినే బోగీలోనికి ఎక్కి సీట్ వరసకు చేరుకున్నాడు. 72 లో కూర్చుని సూట్‌కేస్ తెరిచాడు. రీడింగ్ మెటీరియల్ లోనుంచి ఓ అందయిన పుస్తకం బయటకు తీసి, సూట్‌కేస్ భద్రంగా తాళం వేసి పైకెత్తి లగేజ్ రేక్ మీద పెట్టేశాడు. రెండో పుస్తకం కావలసి వచ్చినప్పుడు తప్ప ఇంక దానిని ముట్టుకునే పనిలేదు. ఇప్పుడే అన్ని పుస్తకాలు బయటపడేస్తే, అవి ప్రయాణం చేస్తాయి- తహరా పట్టు కోవడం కష్టం.

కుర్రవాడికి, తనకు మధ్యనో సీటు కాళీ.

ఎదురుగా భార్య భర్త కూర్చున్నారు. ఆమె కిటికీ దగ్గర సీట్ తీసుకుంది. చివరి సీట్ కాళీ. దయానంద్ విశ్రాంతిగా కాళ్లు జాపుకు కూర్చున్నాడు ఆ సీట్ కింద దాకా. ఎవరేనా వచ్చి కూర్చుంటే, కాళ్లకు యీపాటి 'చలనం' ప్రాప్తి వుండదు.

ఆమె వయిపు చూడాలంటే ముఖం కాస్త పక్కకు తిరగాలి. బాగుండదు. ఓర కంట చూడడమే మార్గం. పెద్ద మనిషి తరహాకు అభ్యంతరం వుండ కూడదు. నశ్యం రంగు చీర. తను యిందాక గమనించడంలో ఏమీ పొరపాటు పడలేదు. జాకెట్ కూడా అదే రంగు. ఆ సంగతి వేరే చెప్పాలి!

చెవులకు మూడు అంగుళాల డయామీటర్ వున్న రింగులు. ఆమె తల అటు, యిటు తిరిగినప్పుడల్లా వాటి కదలిక కొట్టవచ్చినట్లు కనిపిస్తోంది. ఎవరినీ కొట్టడం లేదు, నయమే!

ఎడమ ముక్కుకు ఒంటిరాయి ముక్కు పుడక.

ముఖం... మనిషి... ఆసాంతం గమనించీ గమనించనట్లుగా చూచాడు. జామ పండులా ఎరుపు, తెలుపు కలిసిన ఒంటి రంగు. అంత విశాలమయిన నుదురు కాదు. నశ్యం రంగులోనే గుండ్రటి చుక్క. భార్య, భర్త ఏమిటో మాట్లాడుకుంటున్నారు. వినడం మంచిది కాదు. పుస్తకం చదువుతున్నట్లు కూచుంటే మంచిది. అయినా యింకా రైలు బయలు దేరక ముందే చదవడం కూడా మంచిది కాదేమో. కంపార్ట్ మెంట్ అంతా కళ్ళతోనే అగుపించినంత మేర సర్వేచేయడం మంచిది.

కుర్రవాడికి తనకు మధ్యనున్న సీటు, ఆ భార్యా భర్తల పక్కన మూడో సీటు కాళీగానే ప్రయాణం చేసేట్లున్నాయి. ఇంకా ఎవరూ రాలేదు. ఆఖరు క్షణంలో ప్రయాణం మానుకుని వుంటారు. ఏదో అవాంతరం వచ్చి వుంటుంది. ప్రయాణం చేయాల్సిన అవసరం తీరిపోయి వుంటుంది. ఏదో జరిగి వుంటుంది.

ఆ సీట్లు కాళీగా వుండడమే తనకు ఇష్టం. రైల్వేలకు నష్టం. అయినా ప్రయాణం హాయిగా చేయవచ్చును.

రైలు బయలు దేరింది.

భయపడడమేగాని, అననుకూలమయిన ప్రక్రియ ఏదీ జరగలేదు. దేవుడు తనకు మేలుచేయబోతున్నాడా?

భార్యా భర్తలు నింపాదిగా రహస్యంగా మాట్లాడు కుంటున్నారు. ప్రయత్నపూర్వకంగా వినదల్చుకున్నా మూడో మనిషికి కష్టమే. కుర్రాడి సంగతి వాళ్లకు పట్ట లేదు. కుర్రాడికీ వాళ్ళ సంగతి ప్రస్తుతం అక్కర్లేదు. కిటికీ పక్క సీట్ దొరికింది. ప్రయాణం పొడుగునా ప్రకృతిని తనివి తీరా చూడవచ్చును. ఆనందించ వచ్చును, మేను పులకింప చేసుకోవచ్చును.

కాఫీ కేక వినిపించింది.

కాఫీ తాగితే మంచిదే. మొదటి వాయి గనుక తప్పకుండా వేడిగా వుంటుంది. ప్లాట్ ఫాం మీద తాగక పోవడమే మంచిదయింది.

కాఫీ తాగేటప్పుడు బయట హోటళ్ళలో గానీ, ఎవరి ఇళ్ళలోనయినాను కప్పు చెవి ఎడమ చేతితో పట్టుకుని తాగడం మంచిదని ఓ మిత్రుడు సలహా యిచ్చిన విషయం గుర్తు వచ్చింది.

ఎందుకని అని తను అడిగినప్పుడు ఆ మిత్రుడు 'అందరూ సర్వ సాధారణంగా కుడిచేత్తో పట్టుకు తాగుతారు. మనం ఎడమ చేత్తో పట్టుకు తాగితే, అందరూ పెదిమలు తాకించి ఎంగిలి చేసిన కప్పు 'అంచు' మనకు తగలదు. అట్లా తగలకుండా వుండడం ఆరోగ్యకరం, హైజీనిక్' అన్నాడు.

అప్పట్నుంచి ఎప్పుడు అలాంటి సందర్భం వచ్చినా యీ సలహా గుర్తుకు వస్తూ వుంటుంది.

తాగే వాళ్ళందరూ ఈ సలహానే పాటిస్తే ఏమవు తుంది! లేనిపోని కుశ్శంకలు- అందరికీ అన్ని సంగతులూ తెలుస్తాయా? తీరా కాఫీ అందించినప్పుడు చూస్తే అది కప్పు కాదు, ప్లాస్టిక్ గ్లాసు. దానికి 'చెవి' లేదు. ఒకరు తాగిన తర్వాత కడిగి మళ్ళీ ఇంకో మనిషికి ఇస్తారు. కొన్ని సంవత్సరాల క్రితం అయితే పేపర్ గ్లాసులు ఇచ్చేవారు రైళ్ళలో. తాగడం, కిటికీలోంచి అవతల పారవేయడం. కాని అది 'ఇకానమీ' కాదేమో, మానేసి ప్లాస్టిక్ గ్లాసులు పెట్టారు. ఉత్తరాదిలో అయితే శుభ్రంగా 'మట్టి కప్పులు' ఇస్తారు టీ తో తాగేసింతర్వాత ఆ 'మడక' కిటికీ లోంచి అవతలపారేసి, అది పగిలి పోయిన శబ్దం విన్నప్పుడు 'కసి' తీరినంత ఆనందం అనిపించేది. ప్రయాణంలో ప్లాస్టిక్ గ్లాసులు, స్పూన్లు, యీ మడకలు మోసుకు వచ్చేవాడు ఇంటికి- భార్య వద్దని కోపం చేసేదాక.

కాఫీ తాగి డబ్బులు చెల్లించి వళ్ళు విరుచుకున్నాడు. అమ్మమ్మ చెప్పిన ప్రకారం అలా చెయ్యకూడదు. 'గాడిద పొట్ట' అవుతుంది. ఇప్పుడనుకుని ఏం లాభం, గుర్తు రాలేదు.

ఆమె అంటూంది! 'బిస్కెట్లు తీసియివ్వనా?'

'అప్పుడేనా? ఒక గంటయినా ప్రయాణం నడ వందే!'—బిస్కట్లు తినడానికి కూడా ముహూర్తం.

ఆమె బిస్కట్ల బుట్ట తెరవలేదు. భర్త మాట జవదాటగూడదు గదా! ఇంటి దగ్గరయితే ఫరవాలేదు! ఇక్కడ యిలా దారి మధ్యలో ప్రయాణంలో అతనే మయినా కసురుకుంటే ముఖం చిన్నబుచ్చుకోవలసి వస్తుంది.

దురవస్థ!

అసలే ముఖం—నుదురు—చిన్నవి.

బుగ్గలు గాలి ఉబ్బి నిండుగా అందంగా వున్నాయి.

ఆమె పేరు 'ఇందుమతి' అయితే ఎంత బాగుండును!

—ఈ పేరు ఎలా స్ఫురించిందో.

ఎవరూ తెలియదు, ఈ పేరు కలవాళ్ళు. ఎందుకు అనిపించిందో-- దేవుడు చల్లగా చూచి యిదే పేరు అయితే...

కాకపోతే మటుకు యేం బాధ?

ఆరు గంటల తర్వాత ఆ మనిషి, ఆ ముఖం తన ముందు వుండదు. ఈ జన్మలో మళ్ళీ వాళ్ళను చూడకపోవచ్చును; కలిసి ప్రయాణం చేయక పోవచ్చును.

ఎందుకు వచ్చిన బాధ!

ఆమె లేచి నిలుచుంది.

దయానంద్ కళ్ళు కూడా పైకిలేచాయి.

ఎక్కడికి?

ఆమె 'టాయిలెట్' వయిపు నడుస్తోంది. తమ వరసకు దగ్గరగా వున్న జాగానే నడుస్తోంది. పోనీలే, నలభయి-యేభయి మందిని తోసుకుంటూ-అందరి కళ్ళల్లోను పడుతూ-పోనక్కరలేదు. ఆమె వెడుతున్నప్పుడు మాస్తే బాగుండదు—అని పుస్తకంమీదకు మళ్ళించాడు దృష్టి.

వస్తున్నప్పుడు అయితే ఫరవాలేదు. తలిమ్మావాళ్ళకు తెలియదు. భుజంనిండా పమిట కప్పుకుని నిదానంగా వస్తోంది. పచ్చటి వొళ్ళు కొత్తరంగుతో కనిపిస్తోంది.

దోసపళ్ళ లాంటి...

ఊహు. అలా అనుకోవడం మంచిదికాదు.

దేవుడు తనకు మేలు చేస్తున్నాడు. తన మనస్సులోనికి దురూహాలు దురాశలు రాకూడదు. మంచి కాస్తా విత్‌డ్రా అయిపోతే--కష్టం.

ఆమె ముఖంవయిపు తాపీగా మాచాడు.

అమాయకమయిన ముఖం

చిన్నప్పుడు ఓ స్నేహితుడు చెబుతూ వుండేవాడు.. ఇప్పుడతను వచ్చిపోయి ఏ స్వర్గంలోనో చక్కగా తాగుతూ కాలక్షేపం చేస్తూవుంటాడు-- 'అమాయకుల్లోనే అగ్నిహోత్రం వుంటుంది!'

నిప్పురవ్వలు.

ముట్టుకుంటే కాలుతాయి.

ముట్టుకోకపోయినా భయ పెడతాయి.

పాపంచేసిన వాళ్ళకు అగ్నిహోత్రం అంటే భయం.

వెనకటి రోజుల్లో అరచేతిలో నిప్పు కణికలు పోసుకుని ప్రమాణాలు చేయించేవాళ్లట. ఇప్పుడు ప్రమాణాలు లేవు... ప్రమాదాలు లేవు. దొరికితేనే దొంగలు. దారి సజావుగా వున్నంతసేపూ పాడుగ్గా వెళ్ళిపోవడమే.

ఆమె మళ్ళీ సీట్లో సెటిలయి--భార్యాభర్తలు యిష్టాగోష్టిలోపడ్డ తరువాతగాని దయానంద్ తన పుస్తకం పుటలవైపు దృష్టి మళ్ళించలేదు.

పుస్తకం పుటలలో-లైన్లలో అమాయకమయిన ముఖమే కనిపిస్తోంది. ఒక పుటలో ఆ ముఖం! ఎదురు పుటలో అగ్నిహోత్రం. పుస్తకం కాలిపోతుందేమోనని భయంవేసి అగ్నిహోత్రం కనిపిస్తున్న పుటలవయిపు పుస్తకాన్ని మడిచి చదవసాగాడు. పుస్తకం పాడయితే అయింది; కాలిపోవడం కన్నానయం కదా.

పేజీ తిరగడంలేదు. అసలు చదువుతూంటే కదూ! మనసంతా ఎక్కడో. పేజీలు తిప్పితే మటుకు ఏం లాభం? ఇలా అయితే యింత రీడింగ్ మెటీరియల్ తెచ్చుకుని మోత దండుగ గదూ!

మనసు స్వాధీనం లేకపోవడం కాదు.

ఏంచేయ దలుచుకుందో అదే చేస్తోంది.

దాన్ని వద్దని చెప్పడం లేదు గదా. కళ్లెం చేతిలో పట్టుకోకుండా దానికే వప్పగించి ఊరుకున్నాడు; ఎన్నెన్ని పక్కదారులు పడుతుందో గమనిస్తూ.

తినుబండారాలవాడు వచ్చాడు.

దయానంద్ కొనుక్కోలేదు.

కుర్రవాడు కావాలన్నాడు.

'వద్దు. మన దగ్గర సంచిలో బోలెడున్నాయి!' అంది ఆమె.

'అయితే తియ్యి'

## రహస్యాలు

చీకటి గుహల్లో
గీయబడ్డ
చిత్రాల్లాంటివి-
కొన్ని రహస్యాలు!
ఎదదివ్వెను వెలిగించుకొని
మాస్తేనే అవి ఆహ్లాదకరం!
కోడి పెట్టలచే
పెట్టబడ్డ
గుడ్ల లాంటివి—
కొన్ని రహస్యాలు!
నిర్ణీత కాలాన్ననుసరించి
పగిలితేనే అవి శ్రేయస్కరం!

—'రఘువర్మ'

'ఇప్పుడు కాదు. పై స్టేషన్లో రైలు ఆగి-మళ్ళీ కదిలాక' అన్నాడు అతను.

—ఎప్పుడూ యింతే నువ్వు అన్నట్లుగా తండ్రి వయిపు మాచాడు కొడుకు.

.'తప్పకదూ. ఓపిగ్గా కూర్చో' అన్నట్లుగా కుర్రాడి ముఖంలోకి మాచింది 'ఇందుమతి'.

కుర్రవాడి పేరు యేమయి వుంటుంది?

ఏదో అవనీ. తనకెందుకు?

కుర్రవాడిని బుజ్జగించి అనేక సంగతులు తెలుసుకోవచ్చును. వాడితో మాటలు పెంచుకుంటే.. బోలెడంత సమాచారం--అడిగీ అడగకుండానే బయట పడుతుంది.

కాని ఎందుకు ఆ శ్రమ?--వాళ్ళకేదయినా 'ఎంబరా సింగ్' గా అనిపించవచ్చును. మనసులో సవాలక్ష అను కుంటాను. దానివల్ల ఎవరికీ యే బాదరబందీలేదు. పైకి పొక్కితే యింకేమయినా వుందా? అయినా కుర్రవాడు ముద్దుమాటల వయసువాడయితే 'నాన్నా, నీ పేరేమిటి?'—మీ అమ్మ పేరేమిటి—మీ నాన్న పేరేమిటి, మీ తాత—అమ్మమ్మ—నాయనమ్మ--పేర్లు యేమిటి అని మురిపెంగా రాబట్టవచ్చును. అయిదారేళ్ళ వాడు--ఒకటో, రెండో చదువుతున్నవాడు. ఝుమ్మని యింగ్లీషు మాట్లాడగలవాడు--వాడితో తనకు సరసాలు ఎలా?

ఏదో స్టేషన్లో రైలు ఆగింది.

స్టేషన్ ప్లాట్‌ఫాం ఆమె కూర్చున్న వయిపే వచ్చింది. రైలు ఆగుతూ వున్నప్పుడే ఆమె కళ్ళు ఆత్రంగా ప్లాట్‌ఫాం అంతా వెతుకుతున్నాయి.

రైలు ఆగడంతోటే..'అరుగో. యిక్కడే వున్నారు-' అంది చేతులు కిటికీ లోంచి బయటకు చాపి పిలుస్తూ, భర్తతో. వాళ్ళు కిటికీ దగ్గరకు వచ్చి నిలుచున్న తర్వాతగాని, దయానంద్ కంట పూర్తిగా పడలేదు.

దాదాపు యీ జంట యీడువాళ్ళే మరో జంట! కిటికీలోంచి చేయిచేయి కలిపి పలుకరించుకున్నారు- ఆ భార్యాభర్తలు యీ భార్యాభర్తలూను.

'మీరు వస్తారా, రారా అనుకుంటున్నాం.'

'నయం. తెలిశాక కూడా రాకుండా వుంటామా?'


'అసలు రానని ఎలా అనుకున్నావే, నీ అసాధ్యం కూల...' ప్రయాణీకులు ఎక్కడం, దిగడం రద్దీ.

'పది నిముషాలు ఆగుతుంది యిక్కడ. తొందరేం లేదు. లోపలకు రండి. మాట్లాడుకుందాం' అంది 'ఇందుమతి'.

బయట నించున్న అతను—'నువ్వు లోపలకు

పద్మాలయ వారి
నవలా నవమోహిని
1986 సంక్రాంతి నవలల పోటీలో
రూ. 3000/- బహుమతి గెలుచుకున్న
సస్పెన్స్ థ్రిల్లర్ నవల
'నీడలతో క్రీడలు'

రచన శ్రీమతి 'వోతా పద్మినీదేవి
శ్వేతని బ్లేక్ మెయిల్ చేసి
వెంటాడి వేధిస్తున్నదెవరు?
త్వరలో ప్రారంభం




వెళ్ళు. మేం ప్లాట్‌ఫాం మీద నిలబడి మాట్లాడు కుంటాం—' అని రైల్లోకి చూచి 'రావోయ్ బయటకు', అన్నాడు.

'ఇందుమతి' భర్త లేచి రైలు దిగాడు.

ఆమె లోపలకు వచ్చింది.

కుర్రవాడికి ఫైవ్‌స్టార్ చాక్‌లెట్ దొరికింది.

మగవాళ్ళు యిద్దరూ రైలు పెట్టెకు దూరంగా, పళ్ళ దుకాణానికి, పుస్తకాల దుకాణానికి మధ్య నిలబడి యేమిటో మాట్లాడుకుంటున్నారు.

దయానంద్ కూడా దిగుదాం అనుకున్నాడు ముందు. ఇంతలో కొత్త ఆమె 'ఎలా వున్నావు. కాస్త వొళ్ళుచేశావు యీ సంవత్సరంలో. మళ్ళీ యేమన్నా...' అంది.

'చాల్లే. ఊరుకో. సమయం సందర్భం లేదు నీకు—' అంది 'ఇందుమతి', సిగ్గు—కోపమూ కలిపి.

వాళ్ళిద్దరూ ఎదురుగుండా ఓ మనిషి వున్నాడనీ, యిది రైలు కంపార్ట్‌మెంట్ అనీ స్పృహ లేకుండా--ఫ్రీగా, హాయిగా వాళ్ళ యింటి డ్రాయింగ్ రూంలో మాట్లాడు కుంటోన్నట్లే వున్నారు.

దయానంద్ రైలుపెట్టె దిగలేదు.

'అమ్మాయిని తీసుకు రాలేదేం?' అనడిగింది 'ఇందుమతి'.

'ఇంకా స్కూల్ నుంచి రాలేదు. పోన్లే. తిరుగు ప్రయాణంలో అలాగన్నా దిగుతావని తీసుకురాలేదు. రెండ్రోజులు వుండి మరీ వెడుదువుగాని—'

'చూద్దాంలే'

'చూద్దాంకాదు. నువ్వు రాకపోతే నా మీద వొట్టే.'

'ఒట్టుతీసి గట్టున పెట్టు. వీలు అవుతుందో లేదో. అప్పటిమాట గదా. ఏమిటది చిన్నపిల్లలాగా వొట్లూ, వామనగాయలూను!—'

'ఇందుమతి' మందలించడంతో స్నేహితురాలు 'టాపిక్' మార్చివేసింది.

'అయిదు నిమిషాలు అయిపోయింది. ఏమిటి చెప్పు.. సంగతులు. మీ ఆయన ఆఫీసూ అదీ బాగా నడు స్తోందా? ఈ సంవత్సరం యేమాత్రం లాభాలు వస్తాయట?—' అనడిగింది 'ఇందుమతి'.

ఆమె కిటికీ లోంచి ప్లాట్‌ఫాం మీదకు చూచింది. ఇద్దరు మగవాళ్ళూ—చెవివేటు దూరంలో లేరు.

'వాళ్ళు చూడు ఎలా సాయలా పాయలాగా మాట్లాడు కుంటున్నారో. మనకు మాట్లాడుకుందుకు సంగతులే వుండవు...'

'అది సరేగాని...' అని ప్రారంభించింది స్నేహితు రాలు.

'ఊ...'

## ఓ నేస్తమా !

ఎవరైనా, ఎక్కడైనా కల్సివుండేది
కొన్నాళ్లే
స్నేహం ఎంతయినా !
తప్పించుకోవాలన్నా తప్పవు
ఈ విడిపోవడం వీడ్కోలులు
బాధ ఎంతైనా !

కానీ...మిగుల్తాయి
మనిషి మనసుల్లో చెరిగిపోని
మరచిపోని మధుర స్మృతులు
మధురాను బంధాలు
సృష్టిలో తీయనైన స్నేహాను బంధాలు

— రహీమున్నిసా (ఇంటర్)

'అతన్నించి మళ్ళీ ఎలాంటి ప్రాబ్లెమ్స్ లేవు గదూ?'

ఎవర్నుంచీ—అన్నట్లు ముఖం పెట్టింది ఇందుమతి. చిన్న ముఖం-చిన్న నుదురు. నల్యం రంగు బొట్టు. దయానంద్ గమనిస్తూ కూర్చున్నాడు.

'అదేనే. దయానంద్ నుంచి'

దయానంద్ ఉలిక్కిపడ్డాడు. తనవించీ ప్రాబ్లెమ్సా?. ఎవడో తన నేమ్ సేక్!

'ఓ! అతనా? ఉహూ..మళ్ళీ ఉత్తరం యేమీ వ్రాయలేదు. నీవు మందలించిన తర్వాత. ఒకటి, రెండు మార్లు మా వూరు వచ్చాడని తెలిసిందిగాని నన్ను చూడడానికి మాత్రం రాలేదులే!'

'దేవుడు రక్షించాడు'

'నువ్వు బాగా మందలించి వుంటావు అనుకున్నాను'

'బాగా అంటే యిట్లా అట్లాగా? ముఖం వాచేట్లు చివాట్లు వేశాను. మళ్లా అలాంటి పిచ్చివేషాలు వేస్తే, మా ఆయన్తోచెప్పి ఉద్యోగం పీకించేస్తాను అని బెదిరించాను. నా మాట వినక యే చెరువు నీళ్ళు తాగుతాడు?'

'పాపం!'

'అలాంటి వాళ్లను పాపం తలవడం తప్పు—'

'పోన్లే యింకేం అనకు. మారిపోయాడుగా—'

'నీకింకా అతనంటే లోపల యే మూలో సానుభూతి వున్నదని నాకు తెలుసులే. అయినా అవివేకంగా ప్రవర్తించి ముప్పుతెచ్చుకోకు. ఆ గాలి యిటు వీచడానికి లేకుండా జాగ్రత్తపడు. పిచ్చి ముఖానివి. నీకు మంచి, చెడ్డ తెలిసియేడిస్తే...'

'సర్లేవే. నన్ను తిట్టడం ప్రారంభించకు. అంతా సరిపోయిందన్నాగా. నీ సహాయానికి నిండా థాంక్స్.'

'అయిపోయింది చాలదు. ముందు ముందు యెలాంటి యిబ్బందులూ లేకుండా చూచుకోవాలి! అదీ మెలుకువ అంటే...'

'అలాగేలే. నువ్వు చెప్పినట్లే...'

'సర్లే. మీ ఆయనకేం అనుమానం రాలేదుగద. నీతో మామూలుగానే వుంటున్నాడా?--ఏమన్నా ఎడ ముఖం పెడముఖం...'

'అబ్బే అలాంటిదేం లేదు. మేం యిద్దరం పర్‌ఫెక్ట్ కపుల్.'

'అదుగో. వాళ్ళు వచ్చేస్తున్నారు' అంది స్నేహితురాలు.

'రైలు కూతవేస్తోంది. దిగు—' అన్నాడు ఆమె భర్త.

'ఇందుమతి భర్త' లోపలకు వచ్చాడు.

'చాల థాంక్సండీ. ఆఫీసు టైం అయినా శ్రమ అనుకోకుండా వచ్చారు, యిద్దరూ—' అన్నాడు అతను ఆమెతో.

మళ్ళీ అదేమాట— అంది ఆమె. 'తిరుగు ప్రయాణంలో దిగడం మాత్రం మర్చిపోకు సుమా... దేవుడు మేలుచేసి...' అంటోంది ఆమె యింకా ప్లాట్‌ఫాం నుంచి.

రైలు కదిలిపోసాగింది.

స్నేహితులు, స్నేహితురాళ్ళు చేతులు ఊపుకున్నారు.

రైలు వేగం పుంజుకుని పరుగెత్తుతోంది.

జీవిత రథం ముందుకు సాగిపోతోంది.